క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

డ్రైనేజీలు పునర్నిర్మించాలని డిమాండ్



మిథిలాపురి వుడా కాలనీలో శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ మిథిలాపురి వుడా కాలనీలో డ్రైనేజీలు శిథిలమైపోవడంతో మురుగునీరు నివాసాల మధ్య రోజుల తరబడి నిలిచిపోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఖుషీ షాపింగ్‌మాల్ ఎదురుగా ఎంఐజీ – 501 ప్రాంతంలో ఈగలు, దోమలు ముసురుకోవడమే కాకుండా పందుల సంఖ్య పెరిగి ఇబ్బందిగా ఉంటుందని, అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టి డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని మధురవాడ వుడా కాలనీ నివాసి వైఏస్ చలపతిరావు, తదితరులు కోరుతున్నారు.

ఘనంగా బల్లల పండగ



పూజలు చేస్తున్న భక్తులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెంలో శ్రీ కంచి కామాక్షమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనధికార నిర్మాణం తొలగింపు



అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ జగనన్న లే అవుట్‌లో అనధికారికంగా నిర్మించిన పలు నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఆదివారం ఉక్కుపాదం మోపారు. ఈ కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు అనధికారికంగా పునాదులు తవ్వి, బేస్‌మెంట్ నిర్మిస్తున్నారంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ గోవింద్ ఆదేశాలతో వీఆర్వో అప్పారావు పరిశీలించారు. సిబ్బంది సాయంతో అనధికారిక నిర్మాణాలు తొలగించారు. నగరపాలెం నుంచి బోయపాలెం వరకు రోడ్డు విస్తరణ పనులతో భూముల రేట్లు పెరగడంతో ఇక్కడ ఉన్న పలువురు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోవింద్ హెచ్చరించారు.

చురుగ్గా సర్వీసు రోడ్డు నిర్మాణం





కొమ్మాది జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని సర్వీసు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న జేసీబీ, సిబ్బంది

రూ.30 లక్షలతో పనుల నిర్వహణకు ఇటీవల శంకుస్థాపన

మధురవాడ : ఎన్నో ఏళ్లుగా హైవేలో ఒన్‌వే రాకపోకలతో ఇబ్బంది పడుతున్న పలు కాలనీల ప్రజలు, పలు సంస్థలకు చెందిన విజిటర్స్, పాఠశాలల పిల్లలకు ఇబ్బందులు తప్పనున్నాయి. వైఎస్సార్ కాలనీ, డ్రైవర్స్ కాలనీలతోపాటు ఇక్కడ పలు పాఠశాలల విద్యార్థులు హైవేలో సర్వీసు రోడ్డు లేక అనేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఇక్కడి పెట్రోలు బంక్, బీఎస్ఎల్ కార్యాలయం, ఈ రోడ్డులో ఉన్న గాయత్రి మెడికల్ కాలేజీ, ఆస్పత్రులకు వెళ్లి రావాల్సిన వారు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు కూడా గురయ్యేవారు. ఈ ఇబ్బందులను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు తీసుకెళ్లారు. దీంతో జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ నుంచి వైఎస్సార్ కాలనీ వద్ద గల శ్రీచైతన్య టెక్నో స్కూలు వరకు హైవేని ఆనుకుని హాట్ మిక్స్ సర్వీసు రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు నిధులు మంజూరు చేయడమే కాకుండా ఇటీవల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన కూడా చేశారు. శంకుస్థాపన చేసి కనీసం 10 రోజులు కూడా దాటకముందే నిర్మాణ పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించిన నాటి నుంచే మరింత చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, మెడికల్ కాలేజీ, ఆస్పత్రికి వచ్చే వేలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

రూ.18 లక్షలతో తారు రోడ్డు

పీఎంపాలెం : కారుషెడ్ కూడలి నుంచి పీఎం పాలెంకు వెళ్లే పాత రోడ్డు అభివృద్ధి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ మార్గం రాళ్లురప్పలతో అత్యంత దయనీయంగా ఉండేది. రాత్రి వేళ్లలో ప్రయాణించడానికి మరీ ఇబ్బందిగా ఉండేది. ఈ సమస్యను స్థానికులు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో... స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు చేయించారు. దీంతో వెంటనే అధికారులు పనులు ప్రారంభించి ఆ మార్గాన్ని తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. మెరుగైన రహదారి అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లేందుకు నిర్మించిన తారురోడ్డు

సర్వీస్ రోడ్లపై వాలుగట్లు తొలగింపు

తగరపువలస : జాతీయ రహదారులను ఆనుకుని నివసిస్తున్న వారు తమ సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న వాలు గట్లును ఇటీవల ఆ శాఖ సిబ్బంది జేసీబీలతో తొలగించారు. సర్వీస్ రోడ్లను ఆనుకుని డ్రైనేజీల మీదుగా తమ ఇళ్లకు నడిచి వెళ్లేవారు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి జీవీఎంసీ పరిధిలో బంగ్లామెట్ట నుంచి భీమిలి మండలం తాళ్లవలస వరకు కాంక్రీట్ సాయంతో ఎవరికివారు ఈ గట్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో తమ వాహనాలను సర్వీస్ రోడ్లపై నిలపకుండా గట్లు సాయంతో ఇళ్లకు లేదా డ్రైనేజీలపైకి చేరుకునేవారు. ప్రస్తుతం గట్లు తొలగించడంతో తమ వాహనాలు ఇళ్లకు చేరే మార్గం లేక సర్వీస్ రోడ్డుపై నిలపాల్సి వస్తోందని వాపోతున్నారు. దీని వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. తమ ఇళ్లకు సమీపంలో సర్వీస్ రోడ్డు నుంచి డ్రైనేజీల మీదుగా వాహనాలు చేరడానికి వాలుగట్లు నిర్మించడానికి అవకాశం కల్పించాలని జాతీయ రహదారి వెంట నివసిస్తున్న వారు కోరుతున్నారు.



వలందపేట వద్ద సర్వీస్ రోడ్డుపై వాలుగట్లు తొలగిస్తున్న హైవే సిబ్బంది

మోదీ పాలనలో ప్రజలకు మేలు

భీమునిపట్నం : బీజేపీ ప్రభుత్వం ద్వారానే ప్రజలకు అన్ని విధాలా మేలు జరుగుతుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జీవీఎంసీ 3వ వార్డు పరిధి భీమిలి రెల్లి వీధి ప్రాంతంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాల ద్వారా మేలు జరిగిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ మన దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని కొనియాడారు. మళ్లీ ఆయన పాలనను ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. దళితుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, వారికి ఎన్నో మంచి పనులు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రెల్లివీధిలో ఇంటింటికీ తిరిగి వారి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి సహకరిస్తామని వెల్లడించారు. జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, ముఖ్య నాయకులు రామ్మోహన్, దిలీప్ వర్మ, దామోదరరావు, సంజీవరావు, నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, ఉప్పాడ అప్పారావు, కంటుభుక్త సునీత, చెన్నారాము పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యకుమార్

40 మంది రక్తదానం

పద్మనాభం : రక్తదానం చేసి మరొకరికి ప్రాణం పోయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా మండలంలోని కృష్ణాపురంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు 21 రోజులకు ఒకసారి రక్తాన్ని మార్పిడి చేయాలన్నారు. అటువంటి పిల్లలకు రక్తాన్ని ఇవ్వడానికి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 40 మంది రక్తాన్ని దానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారు మొకర వినయ్‌ను 63053 86227 సంప్రదించాలని సూచించారు. కృష్ణాపురం యూత్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, సుంకర అచ్చింనాయుడు, గాడు అప్పలరాజు, తాలాడ నరసింహనాయుడు, సురాల దేశి పాల్గొన్నారు.



రక్తదాతలతో ఎంపీపీ రాంబాబు, తదితరులు

ఎండాడలో స్వచ్ఛ భారత్



వ్యర్థాలు తొలగిస్తున్న వలంటీర్లు

కొమ్మాది : ఎండాడ జాతీయ రహదారికి ఆనుకుని వున్న చెరువులోని వ్యర్థాలను సంత్ నిరంకారి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించి తొలగించారు. చెరువు చుట్టూ వున్న ఫుట్‌పాత్ శుభ్రం చేశారు. సుమారు 200 మంది వలంటీర్లు పాల్గొని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మెర్సురి ప్రేమ్, పీవీ రావు, కార్పొరేటర్ లొడగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస : త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి విజయరాంపురం ప్రతినిధులు ఆదివారం భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా శివరాత్రి ప్రాశస్త్యాన్ని వివరించారు. శివ జాగరణ వల్ల కలిగే ఫలితాలు వివరించారు. శివరాత్రి పూజల్లో పాల్గొనడం ద్వారా కలిగే మోక్షజ్ఞానం గురించి వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాసరావు, సత్యవతి, డి.అంకమ్మ, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శింగనబందలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

తాగునీటి యూనిట్ ఏర్పాటు



బంగ్లామెట్ట వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ యాజమాన్యం తమ తయారీ కేంద్రం బయట ఆదివారం కూలింగ్ తాగునీరు యూనిట్ ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఈ యూనిట్ ఏర్పాటు చేసినట్టు యాజమాన్య ప్రతినిధులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి అండగా శిష్టకరణాలు

తగరపువలస : రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి ఆదివారం పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఆమెను వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్రకటించడంతోపాటు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని బాలలకు భోజనం, పుస్తకాలు స్నాక్స్ పంపిణీ చేశారు. అనంతరం 200 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర శిష్టకరణాల కార్పొరేషన్ చైర్మన్ అనూషా పట్నాయక్, శశిధర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో శిష్ట కరణాలకు గుర్తింపు తీసుకొచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుటుంబమేనన్నారు. శిష్టకరణాలంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో 2వ వార్డు పార్టీ అధ్యక్షుడు శిల్లా భాస్కర రెడ్డి, పద్మనాభం అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్, శిష్టకరణాల సంఘ రాష్ట్ర ప్రతినిధులు అరికతోట చంద్రమౌళి, కె.శివ ప్రసాద్, శేఖరమహంతి దుర్గ, మానాపురం శివ సాయి, ప్రదీప్, సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, గాడు తాతినాయుడు, తెడ్లాపు అప్పలరాజు, కంచుబోయిన వెంకటరావు, సరగడ నాగిరెడ్డి, దుర్రి రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ప్రశాంతి, అనూష

పూర్వ విద్యార్థుల సమావేశం

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2000 – 2001 సంవత్సరానికి చెందిన 52 మంది పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో సరస్వతీ దేవికి పూజలు చేశారు. స్నేహితులు ఒకరినొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. 23 ఏళ్ల కిందటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మురళి, వెంకటరావు, పైడిరాజు, అప్పలనాయుడు, బంగారురాజు, రమేష్, చిన్నారావు, రమాదేవి, సత్యవతి, రమణ, గీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.



తాటితూరు హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు ముగిసిన పోటీలు

తగరపువలస : ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు విద్యార్థులకు తెలుగు, హిందీ మాధ్యమాల్లో వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీవీ రామన్ జీవిత విశేషాలపై వ్యాస రచన పోటీలో 84 మంది తెలుగు, 28 మంది హిందీలో రాశారు.

రామన్ ఎఫెక్ట్ అంశంపై నిర్వహించిన ఉపన్యాస పరీక్షలో తెలుగులో 20, హిందీలో 12 మంది పాల్గొన్నారు. దేశభక్తిని పెంపొందించే చిత్రలేఖనం పోటీలో 16 మంది పాల్గొన్నారు.

దోమలతో విలవిల

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో పగలు, రాత్రి తేడా లేకుండా దోమల బెడద ఎక్కువగా ఉండడంతో స్థానికులు విలవిల్లాడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా దోమకాట్లు సూదుల వలె గుచ్చుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలామంది నిద్రలేమి, తదితర సమస్యలతో బాధపడుతున్నారు. దోమలను పారదోలడానికి బ్యాట్లు, కాయిల్స్, ఫ్యాన్లు వినియోగిస్తున్నా ప్రయోజనం వుండడం లేదని వాపోతున్నారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు.

వీధికుక్కల దాడులు

మరోవైపు భీమిలి జోన్ పరిధిలో ఏ గ్రామంలో చూసినా కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉందని ప్రజలు వాపోతున్నారు. వీధులు, రోడ్లపై కుక్కలు తిష్ట వేస్తూ పాదచారులు, వాహనదారులను వెంటాడుతూ దాడులు చేస్తున్నాయి. దీంతో చీకటి పడితే స్థానికులు ఇళ్లలో నుంచి బయటకు రావడానికి సాహసించడం లేదు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని భీమిలి, తగరపువలస, చిట్టివలస, సంగివలస ప్రజలు కోరుతున్నారు.

ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు రోడ్ల మీద కాకుండా సెల్లార్ పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. నగరంలో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేయడం జరుగుతుందని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌నకు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే సెక్షన్ 190ఏ మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు.

ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్ష



ఏక్యూజే సెంటర్‌ను పరిశీలిస్తున్న డీసీపీ విజయ్ మణికంఠ, సీఐ తిరుపతిరావు



పద్మనాభం గోస్తనీ విద్యాపీఠ్ వద్ద పోలీస్ బందోబస్తు



చంద్రంపాలెం హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల క్యూ

మధురవాడ : ఏపీపీఎస్సీ గ్రూప్ – 2 స్క్రీనింగ్ పరీక్షలు మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి మొత్తం 576 మందిని కేటాయించగా 65 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 511 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను పోలీస్ కమిషనర్ రవిశంకర్, ఏఆర్ ఏసీపీ మోహన్ కుమార్ తదితరులు పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు పోలీసులు, ఇతర అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

పద్మనాభం : మండలంలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్ – 2 పరీక్షకు 108 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 456 మందికి 348 మంది హాజరయ్యారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 240 మందికి 188 మంది, పద్మనాభం గోస్తనీ విద్యాపీఠ్ కేంద్రంలో 216 మందికి 160 మంది హాజరయ్యారు. ఈ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆనందపురం : మండలంలోని 10 కేంద్రాల్లో ఆదివారం జరిగిన గ్రూప్ – 2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆనందపురం, గుడిలోవ, గిడిజాల, కొంత్యాం తదితర గ్రామాల్లోని వివిధ కళాశాలల్లో 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లో 3,968 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి వుండగా 881 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను డీసీపీ విజయ మణికంఠ, ఆనందపురం సీఐ తిరుపతిరావు సందర్శించి మౌలిక సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

వైఎస్సార్ సీపీలోనే దళితులకు సముచిత స్థానం

తగరపువలస : వైఎస్సార్‌సీపీలోనే దళితులకు సముచిత స్థానం లభించిందని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన మాజీ కౌన్సిలర్ జీవీ రమణ సన్మానసభ ఆదివారం సాయంత్రం సంతపేట కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మాత్రమే వినియోగించుకున్నాయన్నారు.

అనంతరం జీవీ రమణ దంపతులను దళిత సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీపీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, కదిరి ఎల్లాజీ, చేట్ల ఎల్లయ్య రెడ్డి, శిల్లా వంశీరెడ్డి, వెంపాడ వెంకటరమణ, పందిరి విజయ్, సిమ్మల ప్రసన్న, వెంపాడ వెంకటరమణ, చేట్ల శ్రీనివాస రెడ్డి, నీలాపు రామిరెడ్డి, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



జీవీ రమణను సన్మానిస్తున్న దళిత సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా అవతార్ మెహర్ బాబా జయంతి



శేరికండంలో అవతార్ మెహర్ బాబా చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం : మండలంలోని శేరికండంలో అవతార్ మెహర్ బాబా 130వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు అవతార్ మోహర్ బాబా చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో నమ్మి వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ అన్నదానాన్ని ప్రారంభించారు. 1000 మంది అన్నప్రసాదం స్వీకరించారు. శేరికండం, సంగుపేట గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.